నమస్తే తెలంగాణ
# జనగామ
5 | గురువారం 11 ఏప్రిల్ 2024 | JANAGAON

## నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, ఏప్రిల్ 10: భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయంఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్‌లో 30 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్లలోపు గ్రామీణ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల వారు 4 పాస్‌ఫోర్టు సైజు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలను తీసుకొని ఎస్‌బీఐ ఆర్‌ఎస్ ఈటీఐ, సంస్కృతి విహార్ టీటీడీసీ హసన్‌పర్తి, హనుమకొండ జిల్లా-506371 అడ్రస్‌లో ఈ నెల 14వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9704056522, 9849307873, 6281260878, 9949108934 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



జనగామలో భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పక్కన బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, చిత్రంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

**కాంగ్రెస్ పాలనలోనే రైతులకు కష్టాలు**

**సాగునీరివ్వక ఎండిపోతున్న పంటలు**

# అభివృద్ధికే ఓటేయండి..

### కేసీఆర్ పాలనలోనే అన్నదాతలకు మేలు.. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలి

### బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

### జనగామ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

### హాజరైన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, మాజీ మంత్రి పొన్నాల, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ రూరల్, ఏప్రిల్10: బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూడండి.. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి గత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన పనులు పరిశీలించండి.. అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనను గమనించండి.. పార్లమెంట్ ఎన్నికల్లో అభివృద్ధికే పట్టం కట్టండి..' అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జనగామ మండలం పసరమడ్ల శివారులోని ఉషోదయ కన్వెన్షన్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు బక్క నాగరాజు యాదవ్, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు వాటి అమలులో విఫలమయ్యారని విమర్శించారు. పదేళ్లలో ఎన్నడూ ఎండిపోని పంటలు సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఎండిపోతున్నాయని తెలిపారు. రిజర్వాయర్లలో నీళ్లున్నా సాగునీరు అందించడం లేదని, చెరువులు, కుంటలు నింపకపోవడంతో పంటలు ఎండిపోయి, పెట్టుబడి రాక రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రైతుబంధు సాయం, పంట నష్టపరిహారం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు.

### కేసీఆర్ పర్యటనతోనే నీటి విడుదల

సాగునీరందక పంటలు ఎండిపోతుంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పొలంబాట పట్టి రైతులను పరామర్శించేందుకు తొలిసారి జనగామ, సూర్యాపేట జిల్లాలకు వచ్చారని ఎమ్మెల్యే పల్లా తెలిపారు. కేసీఆర్ పర్యటన తర్వాతే నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేశారని గుర్తు చేశారు. అదనుకు ముందే చెరువులు, కాల్వలకు నీటిని విడుదల చేస్తే పంటలు ఎండిపోయేవి కావన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఇక్కడ పోటీ పడుతున్న కొందరు అభ్యర్థులు ఫోర్జరీ, స్మగ్లింగ్, డ్రగ్స్ కేసుల్లో దొరికిన వారు ఉన్నారని పేర్కొన్నారు. తమ హయాంలో జనగామ అభివృద్ధికి నిధులు కేటాయిస్తే కాంగ్రెస్ నాయకులు తమ గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జనగామ ప్రాంతం తెలంగాణ సాయుధ పోరాట గడ్డ అని, ఇక్కడ ప్రజల కోసం పనిచేసే నాయకులను ప్రజలు ఎన్నుకున్నారని పల్లా వివరించారు.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

### బీఆర్‌ఎస్‌లో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం : భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

సామాన్య గొర్రెల కాపరుల కుటుంబం నుంచి వచ్చిన తనకు బీఆర్‌ఎస్ నుంచి భువనగిరి ఎంపీ అభ్యర్థిగా ఉద్యమ నేత కేసీఆర్ టికెట్ ఇచ్చారు. 35 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తాను రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా, ఇబ్రహీంపట్నం మార్కెట్ చైర్మన్‌గా పనిచేశానని, గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకుండా డబ్బులకు అమ్ముడుపోయిన టీ-పీసీసీ నేతలు వేరే వ్యక్తికి అవకాశం ఇచ్చారు. ఈ క్రమం లో నా సేవలను గుర్తించిన కేసీఆర్ స్వయంగా పిలిచి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. భువనగిరి ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. ఇటీవల జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో కష్టపడుతున్న కార్యకర్తలకు పదవులు ఇవ్వకుంటే సీఎం రేవంత్‌రెడ్డి అంగీలాగు ఊడపీకేందుకు సిద్ధంగా ఉన్నారు. అన్ని సామాజిక వర్గాలకు టికెట్ల కేటాయింపులో బీఆర్‌ఎస్ ప్రాధాన్యం ఇచ్చింది. కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు ఇవ్వకున్నా నాటి సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 15 మంది బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపిస్తే తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రంతో కొట్లాడుతాం. గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతాం. కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తాం.

### ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్ : ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్సీ

కేసీఆర్ పాలనలో అభివృద్ధి ఎలా ఉంది. నేటి కాంగ్రెస్ పాలన ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. ఎన్నికల సమయంలో అమలు కాని హామీలిచ్చి కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చింది. మొన్నటి దాకా చెరువులు, కుంటలు, కాల్వల ద్వారా గోదావరి జలాలు అందేవి. ఇప్పుడు ఎక్కడ చూసినా ఎండిన పొలాలు, చెరువులు, కుంటలు కనిపిస్తున్నాయి. ఇక్కడి ఎమ్మెల్యే పల్లాకు ప్రభుత్వం నిధులు కేటాయించకున్నా సొంత నిధులతో జనగామను అభివృద్ధి చేస్తారు. ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అందరివాడు. పిలిస్తే పలికే మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

### 119 నియోజకవర్గాలకు నిధులు కేటాయించాలి..
**- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య**

సీఎం రేవంత్‌రెడ్డి తన కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ. 6 వేల కోట్లు కేటాయించినట్లు ఆయనే చెప్పారు. కానీ రాష్ట్రంలో 119 నియోజకవర్గాలు ఉన్నాయని వారికి గుర్తుండాలి. అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి పాటుపడాలి. తెలంగాణ కోసం పోరాటం చేసిన కేసీఆర్ వెంటే ఉండాలని నేను బీఆర్‌ఎస్‌లో చేరా. గోదావరి నదిలో నీళ్లున్నా దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోయలేదు. దీంతో 90 రోజుల్లో తుపాకులగూడెం బ్యారేజీ నుంచి 48 టీఎంసీల నీరు సముద్రంలో కలిసింది. పంటలు ఎండిపోతుంటే ఎక్కడ ఉన్నరు. రైతులను పరామర్శించే తీరిక సీఎంకు లేదా?. కరువు వస్తే కేసీఆర్ పాలన వల్లే అంటున్నరు. మరి మీరు ఏం చేస్తున్నరు. పాలన ఆయనకే అప్పగించండి.

### ఇన్వర్టర్, బ్యాటరీ ఫ్యాక్టరీలు ప్రారంభమైనయ్..
**- ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే**



కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కరెంట్ కోతలు మొదలైనయ్. దీంతో ఇన్వర్టర్, బ్యాటరీలను తయారు చేసే ఫ్యాక్టరీలు ప్రారంభమైనయ్. గతంలో రైతులు కరెంట్ వద్దనేలా వచ్చేది. ఇప్పుడు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. గతంలో ఎండని పంటలు ఇప్పుడు ఎందుకు ఎండిపోతున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలి. గ్రామాల్లో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు కాదు 420 హామీలు ఇచ్చింది. వాటిని అమలు చేయాలి. ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు జనగామ నియోజకవర్గంలో 50 వేల మెజార్టీ ఇవ్వాలి.

కార్యక్రమంలో ఎంపీపీలు మేకల కళింగరాజు, బద్దిపడిగె కృష్ణారెడ్డి, జడ్పీటీసీలు శ్రీనివాస్, పద్మజ, బండ యాదగిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బాల్దె సిద్ధిలింగం, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బండ పద్మ, నాయకులు పసుల ఎబెల్, బక్క నాగరాజు యాదవ్, గద్దల నర్సింగరావు, ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, సేవెల్లి సంపత్, బాలనర్సయ్య, అంకుగారి శ్రీధర్ రెడ్డి, కనకయ్య, బైరగోని యాదగిరి గౌడ్, బొడిగం చంద్రారెడ్డి, మల్లేశం, గంగం సతీశ్‌రెడ్డి, బొల్లం శారద, కందుకూరి ప్రభాకర్, చందు, తాడేం రాజేశ్వరి, చెంచారపు పల్లవి, ధర్మపురి శ్రీనివాస్, మాజిద్, ఉల్లెంగుల సందీప్ పాల్గొన్నారు.



మహిళా రైతుతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

# రైతును నట్టేట ముంచిన కాంగ్రెస్

**పంటలను ఎండబెట్టిన పాపం హస్తం పార్టీదే..**

**ఎండిన పంటలకు ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 25వేలు ఇవ్వాలి**

**ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాల్సిందే..**

**కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్**

**మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో కలిసి ఎండిన పంటల పరిశీలన**

ఎల్కతుర్తి, ఏప్రిల్ 10 : ఎన్నికల సమయంలో అడ్డగోలు అబద్ధాలు చెప్పి తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చి రైతుల నోట్లో మట్టి కొడుతున్నదని, రైతుల ఉసురు పోసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులుండవని బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. రైతు సంఘాల ఆహ్వానం మేరకు మండలంలోని గోపాల్‌పూర్‌లో ఎండిన వరి పంటలను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. రైతులను ఎండిన పంటల వివరాలు అడిగి తెలుసుకొని ఓదార్చారు. దేవాదుల డీఈ వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడి నార్త్ కెనాల్ ద్వారా నీళ్లు ఎందుకు ఇవ్వడం లేదని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్షగట్టి తెచ్చిన కరువన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులంతా సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతుల బతుకులు ఆగమైపోతున్నాయన్నారు. ఎండిన పంటలకు వెంటనే ప్రభుత్వం ఎకరాకు రూ. 25వేలు నష్టపరిహారంతో పాటు వారి హామీ మేరకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన రెండురోజుల్లోనే రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ అసమర్థత కారణంగానే ప్రాజెక్టుల్లో నీళ్లు అడుగంటి పోతున్నాయన్నారు. 2013లో సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి తుమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్ నిర్మించొద్దని అప్పటి మహారాష్ట్ర సీఎంకు లేఖలు రాశారని, దీంతో ఆ ప్రభుత్వం ఒక్క ఎకరం కూడా భూసేకరణ చేసేది లేదని మెలిక పెట్టడంతోనే ఆగిపోయిందన్నారు. మేడిగడ్డ కింద ఉన్న దేవాదుల ద్వారా గోదావరి నీళ్లు వృథాగా పోతున్నా కూడా ప్రభుత్వం పంపులను నడపడం లేదని, విద్యుత్ బిల్లుల పేరుతో పొలాలను ఎండబెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ పేరుతో కేసీఆర్‌ను బద్నాం చేయాలనే అనాలోచిత నిర్ణయంతో రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. ఇప్పటికీ వెయ్యి క్యూసెక్కుల నీళ్లు కిందకు పోతున్నా అవగాహన లేని ప్రభుత్వం పంపింగ్ చేయడం లేదని విమర్శించారు. అధైర్య పడొద్దని, ప్రభుత్వ మెడలు వంచైనా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

### కాంగ్రెస్ తెచ్చిన కరువు ఇది : వొడితెల సతీశ్‌కుమార్

ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ వచ్చిన వెంటనే అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ధర్మసాగర్ రిజర్వాయర్ నార్త్ కెనాల్ ద్వారా సాగు నీళ్లు తీసుకొచ్చి ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు అందించినట్లు గుర్తు చేశారు. అప్పుడు రెండు పంటలకు పుష్కలంగా నీళ్లు అందించామని, ఇప్పుడు యాసంగిలో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోపాల్‌పూర్‌లోనే 200 ఎకరాల్లో వరి పంట ఎండిపోవడం బాధాకరమన్నారు. ఎకరాకు రూ. 25వేలు ఇవ్వడంతో పాటు రైతు మరణిస్తే రూ. 25లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, రైతుబీమాను సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ డైరెక్టర్ శ్రీపతి రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పిట్టల మహేందర్, ఎంపీటీసీలు కడారి రాజు, చెవుల కొమురయ్య, నాయకులు ఎల్తూరి స్వామి, గుండా ప్రతాప్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, దేవేందర్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, హింగె శివాజీ, చదిరం నాగేశ్వర్, కార్తీక్, శ్రీనివాస్, భాస్కర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.






### ఆర్టీసీ లాజిస్టిక్‌లో భద్రాద్రి సేవలు

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 10: భద్రాద్రి సీతారాముల కల్యాణంలో వినియోగించే ముత్యాల గోటి తలంబ్రాలను లాజిస్టిక్ ద్వారా భక్తులకు అందించడానికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించినట్లు హనుమకొండ డీఎం భూక్యా ధరమ్ సింగ్ తెలిపారు. ముందుగా భక్తులు రూ. 151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వరంగల్ బస్టాండ్‌లోని లాజిస్టిక్ కార్యాలయంలో, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సతీశ్‌ను 9154298761 నంబర్‌లో సంప్రదించవచ్చునన్నారు.


















# కొత్త మోటర్ ద్వారా తాగునీటి సరఫరా

**బాసుతండాను సందర్శించిన డీపీవో హరిప్రసాద్**

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**

నర్సింహులపేట, ఏప్రిల్ 10: మండలంలోని బాసు తండా గ్రామ పంచాయతీలో తాగునీటికి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'తాగునీటికి తండ్లాట' శీర్షికన బుధవారం 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ రాజ్ అధికారి హరిప్రసాద్, మిషన్ భగీరథ ఎస్‌ఈ కృష్ణారెడ్డి తండాను సందర్శించారు. ఈ సమయంలో తండావాసులు వారితో వాగ్వాదానికి దిగారు. ఉగాది పండుగ పూట నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గోడు వెల్లబోసుకున్నారు. మంచినీటి బావికి వెంటనే కొత్త మోటర్ ఏర్పాటు చేయించారు. మిషన్ భగీరథ ట్యాంకుకు నీటిని విడుదల చేశారు. తండాలో ఇంటింటికీ తాగునీరు వచ్చేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని, అందరికీ సమానంగా నీరు అందేలా గేట్‌వాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. తండాకు తాగునీరు వచ్చేలా కృషిచేసిన 'నమస్తే తెలంగాణ'కు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీవో సోంలాల్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఏఈలు వెంకటేశ్వర్‌రెడ్డి, రాకేశ్, పంచాయతీ కార్యదర్శి మౌనిక, సాయి, నర్సయ్య ఉన్నారు.



బాసుతండాలో మంచినీటి బావిని పరిశీలిస్తున్న డీపీవో హరిప్రసాద్, ఎస్‌ఈ కృష్ణారెడ్డి

# శెభాష్ మధుప్రియ

**విద్యుదాఘాతానికి గురైన తమ్ముడిని కాపాడిన అక్క**

**బాలిక సమయస్ఫూర్తిని మెచ్చుకున్న స్థానికులు**

**అభినందించిన గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు**

పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 10: కరెంట్ అంటే ఏంటో తెలియని పసి వయస్సులో శక్తికి మించి ఆలోచించి విద్యుదాఘాతం నుంచి తన తమ్ముడిని కాపాడింది ఓ సాహస బాలిక. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. అరకల స్రవంతి-రాము దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తె మధుప్రియ(10) 5వ తరగతి, కుమారుడు మణివర్ధన్(6) యూకేజీ చదువుతున్నారు. ఉగాది పర్వదినమైన మంగళవారం బకెట్‌లో వాటర్ హీటర్ వేసి తల్లిదండ్రులు ఇంటి బయటికి వెళ్లారు. మణివర్ధన్ ఆడుకుంటూ వచ్చి హీటర్‌ను ముట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై గట్టిగా అరిచాడు. వెంటనే అక్క మధుప్రియ అక్కడికి వచ్చి కరెంట్ ప్లగ్ తీయడానికి ప్రయత్నించింది. అది రాకపోయే సరికి చాకచక్యంగా హీటర్ కనెక్షన్ ఉన్న తీగను చేతి చుట్టూ చుట్టుకుని గట్టిగా లాగి ఇంటి బయట పడేసి తమ్ముడి ప్రాణాలను కాపాడింది. జరిగిన విషయం చెప్పడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. బాలిక మధుప్రియను గ్రామస్తులతో పాటు విషయం తెలుసుకున్న మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్, వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు అభినందించారు.



విద్యుదాఘాతానికి గురైన తమ్ముడిని కాపాడిన మధుప్రియ